



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 15 2025 | సంపుటి :0 | సంచిక :300 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




»22 తర్వాత శుభదినాలు కావు.. మిస్సయితే దసరా వరకు ఆగాల్సిందే!

»ఖమ్మం జిల్లా అశ్వారావు పేట సెగ్మెంట్ లో ప్రారంభించనున్న సీఎం?

»పలుచోట్ల చురుకుగా కొనసాగుతున్న నిర్మాణం

హైదరాబాద్: ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుంది. ఈ నెలాఖరు నాటికి ఇండ్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 22తో శ్రావణ మాసం పూర్తవుతుంది. 23 వ తేదీ నుంచి భాద్రపద మాసం స్టార్ట్ అవుతుంది. సహజంగా భాద్రపద మాసాన్ని శూన్యమాసంగా పరిగణిస్తారు. ఈ నెలలో శుభకార్యాలు చేయరు. దీంతో శ్రావణమాసంలోనే పూర్తి చేయాలని సీఎం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లా అశ్వారావు పేట సెగ్మెంట్ పరిధిలోని చంద్రుగొండ మండలంలో సుమారు యాభై గృహాల నిర్మాణం పూర్తయిందని, వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించింది. ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలను నిర్మించాలని సంకల్పంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేక యాప్ ను రూపొందించింది.

ఎలాంటి అక్రమాలు జరగకుండా కమిటీలు వేసింది. నిర్మాణం ప్రారంభించిన ప్రదేశం వివరాలను యాప్ లో పొందు పర్చింది. వాటికి జియో ట్యాగింగ్ కూడా చేసింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే అందేలా అనేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం అవసరమైన ఇసుకను కూడా ప్రభుత్వం ఉచితంగా అందించింది. దీంతో నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల చివరదశకు చేరుకోగా మరికొన్ని చోట్ల పూర్తయ్యాయి. వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం.

## బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష



2లో..

## ఆ 65 లక్షల మంది వివరాలు బయటపెట్టాలి..

ఈసీకి 'సుప్రీం' ఆదేశాలు



2లో..




మన జాతీయ జెండా వెనక ఎంతో చరిత్ర ఉంది. 1857 -సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశమంతటికీ ఒకే జెండా ఉండాలని అప్పటి బ్రిటిష్ పాలకులు అనుకున్నారు. అందులో భాగంగా తయారు చేసిందే బ్రిటిష్ వలస కాలనీ జెండా. దీన్నే 'బ్రిటిష్ ఇండియా జెండా' అని కూడా అంటారు. ఆంగ్లేయుల పాలనలో ఉన్న మిగిలిన దేశాల్లోని జెండా మాదిరిగానే ఇదీ ఉండేది. ఎరుపు రంగులోని ఈ పతాకంలో ఎడమ వైపు బ్రిటిష్ 'యూనియన్ జాక్' సింబల్ ఉండేది. పతాకం కుడివైపు మధ్యలో స్టార్ గుర్తు చుట్టూ బ్రిటిష్ క్రౌన్ చిహ్నం ఉండేది. 1904లో చేసిన మరో పతాకంలో చుట్టూ ఎరుపు రంగు బార్డర్ ఉండేది. అయితే, ఈ జెండాను బ్రిటిష్ ప్రభుత్వం ఒకే చేయలేదు.

వివరాలు 2 లో..

## జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తోంది: అయ్యన్నపాత్రుడు



2లో..

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే..

బ్యాలెట్ విధానంలో ఎన్నికలు: ఎంపీ రఘునందన్‌రావు



»దేశానికి ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీకి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరం.



»బ్యాలెట్ పేపర్ కాకుండా ఈవీఎంల ద్వారా ఎన్నికలను ప్రవేశపెట్టింది గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే (రాజీవ్ గాంధీ).

హైదరాబాద్: దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ.

## భారీ వర్షాలు..

## ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: పొంగులేటి






హైదరాబాద్: వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.

# సంపాదకీయం

## అబద్ధమే ట్రంప్ ఆయుధం



నికోలో మాకియవెల్లి (1469%-1527), పాలకుడు కానప్పటికీ, తన 'ది ప్రిన్స్' పుస్తకంలో పాలకులు రాజ్య స్థిరత్వం కోసం వ్యూహాత్మకంగా మోసం చేయవచ్చునని సలహా ఇచ్చాడు. క్లియోపాత్రా మోసపూరిత దౌత్యంలో ప్రసిద్ధి చెందింది. నీరో చక్రవర్తి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, ప్రత్యర్థులను తొలగించడానికి అబద్ధాలను ఉపయోగించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన మొదటి ఎలిజబెత్ రాణి దౌత్యంలో వ్యూహాత్మక మోసం వాడటంలో పేరు పొందింది. సోవియట్ నాయకుడు స్టాలిన్ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి తప్పుడు ప్రచారాన్ని, సమాచారాన్ని ఉపయోగించాడు. ఇలా చరిత్రలో చాలా మంది పాలకులు రాజకీయ లక్ష్యాలను సాధించడానికి మోసపూరితంగా ప్రవర్తించారని చరిత్రకారులు రికార్డు చేశారు. ఈ క్రమంలోకి చక్కగా ఒదిగిపోయే నాయకుడు, వీరికి వర్తమానంలో వారసుడు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అమెరికా రాజకీయ చరిత్రలోనే అతి ఎక్కువ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసిన నాయకుడిగా ట్రంప్‌ను పత్రికలు, పరిశోధకులు గుర్తించారు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 తప్పుదారి పట్టించే వాదనలు చేశారని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నమోదు చేసింది. అంటే రోజుకి సగటున 21 కంటే ఎక్కువ తప్పుడు వ్యాఖ్యలు అన్నమాట. సీఎన్ఎన్ రికార్డుల ప్రకారం ట్రంప్ ఒక్క ఇంటర్వ్యూలోనే 32 తప్పుడు వాదనలు, ఒక ప్రసంగంలోనే 18 తప్పుడు వాదనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆయన తప్పుడు వ్యాఖ్యలు ప్రధానంగా ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాల పెరుగుదల, తయారీ రంగం విస్తరణ వంటి విషయాలలో కనిపించాయి. ఉదాహరణకు, చైనాపై విధించిన సుంకాలను "చైనా చెల్లిస్తోంది" అని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చాడు. కానీ వాస్తవానికి ఆ భారాన్ని అమెరికా దిగుమతిదారులే మోశారని అధ్యయనాలు నిరూపించాయి. అలాగే, తయారీ రంగంలో రికార్డు స్థాయిలో వృద్ధి జరిగిందని, కోట్ల ఉద్యోగాలు సృష్టించానని చెప్పినా, గణాంకాలు దీనికి విరుద్ధం. కరోనా సమయంలో కూడా ట్రంప్ తప్పుడు వ్యాఖ్యాల ప్రభావం తీవ్రంగా కనిపించింది. కోవిడ్ తీవ్రతను తక్కువ చేసి చూపుతూ, దానిని సాదాసీదా ఫ్లూతో పోల్చాడు. మరణాల శాతం తక్కువగా ఉందని చెప్పాడు. 2020 ఎన్నికల ఫలితాలపై ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు అమెరికాలో విస్తృతమైన అపోహలను సృష్టించాయి. ఎన్నికల్లో మోసం జరిగిందని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చినా– అన్ని చట్టపరమైన పరిశీలనలు, కోర్టు తీర్పులు ఆ ఆరోపణలను ఖండించాయి. వలసదారులు, నేరాల గణాంకాల గురించి కూడా ఆయన అనేక వ్యాఖ్యలు వాస్తవానికి విరుద్ధంగా, రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి.ప్రభుత్వ సంస్థల నమ్మకాన్ని దెబ్బతీయడంలో కూడా ట్రంప్ పద్ధతి ప్రత్యేకం. తన వాదనలకు విరుద్ధంగా గణాంకాలు చెప్పిన ఫెడరల్ అధికారులను విమర్శించడం, లేదా తొలగించడం, తనకు ప్రతికూలమైన డేటాను "నకిలీ" అని పిలవడం చేశారు. పరిశీలకులు దీన్ని "ఫైర్‌హొసింగ్" అంటున్నారు. అంటే తప్పుదారి పట్టించే సమాచారాన్ని పెద్ద ఎత్తున, వేగంగా, నిరంతరాయంగా వెల్లువెత్తించి, ప్రజల విమర్శనాత్మక ఆలోచనను చంపివేయడం. దీనివల్ల వాస్తవం ఏమిటో నిర్ధారించడం కష్టమవుతుంది. ఈ శైలి ఇప్పుడు ట్రంప్ రెండవసారి అధ్యక్షుడైన తరువాత మరింత తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఆర్థిక వ్యవస్థ, ఔషధ ధరలు, రాజకీయ విజయాలు వంటి అనేక అంశాల్లో తప్పు అని తేలిన వాదనలనే ఆయన తిరిగి తిరిగి చెబుతున్నాడు. ఈ తప్పుడు వ్యాఖ్యలు మీడియా, ప్రభుత్వ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకాన్ని క్రమంగా దెబ్బతీసి, అమెరికా రాజకీయ సంభాషణనే మౌలికంగా మార్చేశాయి.వర్తమాన కాలాన్ని సత్యానంతర కాలం అంటున్నారు. ఇందులో వాస్తవాల కంటే భావోద్వేగాలు, వ్యక్తిగత నమ్మకాలు ఎక్కువగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితిలో, స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నా కూడా, తమ భావాలకు లేదా అభిప్రాయాలకు అనుగుణంగా ఉన్న విషయాలనే ప్రజలు ఎక్కువగా నమ్ముతారు. పక్షపాతపూరిత వార్తా మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం మరింత విస్తరిస్తుంది. ఈ మధ్యకాలంలో సత్యానంతరత గురించి అనేక పుస్తకాలు, అధ్యయనాలు వచ్చాయి. అన్నీ కూడా ట్రంప్‌నే ఉదాహరణగా చూపించటం గమనార్హం.ట్రంప్ చెప్పిన, చెపుతున్న అబద్ధాలకు అంతులేదు. గాజా గురించి మాట్లాడుతూ "నేను అక్కడికి వెళ్లాను, అది చాలా సంక్లిష్ట ప్రదేశం" అన్నాడు. అయితే, ఆయన గాజాకు ఎప్పుడూ వెళ్లినట్టు ఎలాంటి ఆధారాలూ లేవు. ఏ రికార్డులూ ట్రంప్ గాజా ప్రయాణాన్ని నిర్ధారించలేదు. ఎందుకంటే అసలు అలాంటి ప్రయాణం జరగనేలేదు. సీఎన్ఎన్ లాంటి వార్తా సంస్థలు దాన్ని తప్పుడు ప్రచారంగా కొట్టివేశాయి. అలాగే, "హమాస్ దాడులు అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుతో జరిగాయి" అనీ, "బైడెన్ ప్రభుత్వమే ఇందుకు కారణం" అనీ ట్రంప్ అన్నాడు. ఈ వాదన పూర్తిగా తప్పు. ఈ నిధులు ఇరాన్‌కు మానవతా సహాయం రూపంలో (ఆహారం కోసం, మందులు కోసం) ఇచ్చినవి, సైనిక ప్రయోజనాల కోసం కాదు. గాజాకు పంపిన ఆహార సరఫరాలను హమాస్ దొంగిలించి, అమ్మేస్తోందని కూడా ట్రంప్ ఆరోపించాడు. అయితే అమెరికా ప్రభుత్వ నివేదికల్లో దీనికి ఎలాంటి ఆధారాలు లభించలేదు. గాజాలో పెద్ద సంఖ్యలో పౌరుల మరణాలకు ఇజ్రాయెల్ కారణమని ట్రంప్ అన్నట్లు ఒక వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయింది. కానీ ఇది కృత్రిమ మేధ (ఆ×) ద్వారా తయారు చేసిన నకిలీ వీడియో అని తరువాత బయటపడింది. ట్రంప్ అలాంటి వ్యాఖ్య చేసిన రికార్డు ఎక్కడా లేదు. అంతకంటే ముఖ్యంగా, ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల విరమణకు తానే ప్రధాన కారణమని ప్రచారం చేసుకున్నాడు. వాస్తవానికి కాల్పుల విరమణ చర్చలు ట్రంప్ ప్రమేయానికి ముందే ప్రారంభమయ్యాయి.మరింత విచిత్రంగా, ఎటువంటి సంకోచం లేకుండా ట్రంప్ అనేకసార్లు తాను భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధం అణుయుద్ధం అయ్యే ప్రమాదాన్ని ఆపేశానని చెప్పుకున్నాడు. ఇరుదేశాలతో ఉన్న అన్ని వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడం వల్లే యుద్ధం ఆగిందన్నాడు. అయితే, భారత అధికారులు ఈ కథనాన్ని పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ అనేది భారత–పాకిస్థాన్ సైనిక వ్యవస్థల మధ్య నేరుగా జరిగిన చర్చల ఫలితమని, ఎటువంటి బయటి మధ్యవర్తిత్వం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి భారత ప్రధాని మోదీ తన మధ్యవర్తిత్వాన్ని కోరాడని అన్నాడు. దీనిని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ వెంటనే ఖండించింది."నాయకులు తమ అబద్ధాలకు సరిపడేలా వాస్తవాన్ని మలచుకునే అధికారాన్ని పొందే ముందు నుంచే, వాళ్ళు వాస్తవాల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని, నిరాదరాన్ని చూపుతారు. వాళ్ళకి నిజం అనేది స్వతంత్రంగా ఉండే విషయం కాదు. దాన్ని సృష్టించగల, మార్చగల మనిషి శక్తిపైనే అది ఆధారపడుతుందని వాళ్ళు నమ్ముతారు," అని అంటుంది హానా అరెండ్ తన రచన 'The Origins of Totalitarianism'లో. కచ్చితంగా ట్రంప్ చేసింది, చేస్తున్నది అదే. తప్పుదారి పట్టించే వాదనల వెనుక ట్రంప్‌కు ఉన్న కారణాలు మానసిక, వ్యూహాత్మక, సాంస్కృతిక కారకాల మిశ్రమం నుంచి పుట్టాయనుకోవచ్చు. ట్రంప్ 'స్వయం ప్రేమ' లక్షణాలను ప్రదర్శిస్తాడని, స్వీయ–గొప్పతనం కోరుకుంటాడని, అపరాధ భావన లేకుండా అబద్ధాలు చెబుతాడని పరిశీలకులు అంటున్నారు. ట్రంప్ అబద్ధాలన్నీ ప్రజా విశ్వాసాన్ని, ప్రజాస్వామ్య ప్రక్రియలను దెబ్బతీసేవే.జార్జ్ ఆర్వెల్ అన్నట్లుగా రాజకీయ భాష అబద్ధాలను సత్యంగా అనిపించేలా, హత్యను గౌరవనీయంగా కనిపించేలా, గాలికి దృఢమైన రూపాన్ని కలిగించేలా చేయగలదు. ఈ భాష పట్ల స్పృహ కలిగి ఉండటం నేటి అవసరం. అలాగే "అనంత జ్ఞానానికి ద్వారం తెరవడం మాత్రమే కాదు, అనంత తప్పిదాలకు హద్దు విధించడం" కూడా ఇవ్వాళ అత్యంత అవసరమైన అంశం.

## ఆగస్ట్ 15 స్పెషల్ : బ్రిటీష్ కాలంలో భారతదేశానికి ఓ జెండా ఉంది.. అది ఎలా ఉంది.. ఎవరు తయారు చేశారో తెలుసా..!

మొదటిపేజీ తరువాయి

### బ్రిటిష్ రాజ్ జెండా

వందేమాతరం ఉద్యమం సమయంలో ఒక పతాకాన్ని 1906 ఆగస్టు 7న స్వాతంత్ర్య సమరయోధుడు శచీంద్ర ప్రసాద్ తయారుచేశారు. దీన్ని వందేమాతరం జెండా, కలకత్తా ఫ్లాగ్ అని పిలిచేవాళ్లు. ఈ జెండా మూడు సమభాగాలుగా ఉంటుంది. పైభాగం ఆకుపచ్చ రంగుతో ఉంటుంది. ఇందులో ఎనిమిది తామరపూలు ఉంటాయి. మధ్యలో పసుపు రంగు ఉంటుంది. ఇందులో హిందీలో రాసిన వందేమాతరం కనిపిస్తుంది. కింది భాగంలో అటు ఇటు సూర్యచంద్రుల బొమ్మలు ఉంటాయి.

కలకత్తా ఫ్లాగ్లో కొన్ని మార్పులు చేసి 1907, ఆగస్టు 22న జర్మనీలో మేడమ్ భికాజీ కామా ప్రదర్శించారు. ఇందులో కమలాలకు బదులు ఏడు నక్షత్రాలు పెట్టారు.1917లో హోంరూల్ ఉద్యమం టైంలో అనీబిసెంట్, లోకమాన్య తిలక్ కలిసి ఒక జెండా తయారుచేశారు. ఈ జెండాలో అడ్డంగా ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చ గీతలు ఉన్నాయి. జెండా పైభాగంలో ఎడమ పక్కన బ్రిటిష్ యూనియన్ జాక్ ఉంటుంది. దానికి కిందిభాగంలో పై నుంచి కిందకు ఏడు నక్షత్రాలు ఉంటాయి. అలాగే జెండాకు కుడివైపు సూర్య, చంద్రుల బొమ్మలు ఉంటాయి.

1921లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఒక జెండాను గాంధీజీ ప్రదర్శించారు. దీన్ని తయారుచేసింది మన తెలుగువాడైన పింగళి వెంకయ్య. ఈ జెండా కూడా మూడు సమభాగాలుగా ఉంటుంది. పైభాగంలో తెలుపు, మధ్యలో ఆకుపచ్చ, కింద ఎరుపు రంగు ఉంటాయి. మూడు భాగాలను కలుపుతూ రాట్నం ఉంటుంది.

### పింగళి మొదటి జెండా

1931లో జాతీయ పతాకంలో కొన్ని మార్పులు చేశారు. ఇందులో ఎరుపు బదులు కాషాయం వాడారు. దీన్ని పై భాగంలో ఉంచారు. అలాగే తెలుపును మధ్యలోకి, ఆకుపచ్చను కింది భాగంలోకి చేర్చారు. మూడు రంగులను కలుపుతూ ఉన్న రాట్నాన్ని ఈ జెండాలో కేవలం మధ్యలోని తెలుపు భాగంలో మాత్రమే ఉంచారు. అలాగే రాట్నం డిజైన్ కూడా మార్చారు.

ఇప్పుడు మనం ఎగరేస్తున్న జాతీయ జెండాకు 1947 జులై 22న స్వతంత్ర భారతావని కోసం రాజ్యాంగ సభ ఆమోదించింది. ఇందులో అంతకు ముందటి జెండాలోని రంగులు, వాటి స్థానాలు అట్లనే ఉంచారు. మధ్యలో మాత్రం రాట్నానికి బదులు అశోక చక్రం పెట్టారు.

## జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తోంది: అయ్యన్నపాత్రుడు

మొదటిపేజీ తరువాయి



అమరావతి: పులివెందులలో ఓడారని జగన్ ఇష్టారీతిన మాట్లాడుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తోందన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేశారని ఆరోపించారు. నామినేషన్లు కూడా వేయనీయకుండా పాలించారని చెప్పారు. "పులివెందుల ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఎక్కడిది? ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు బాధాకరం. ప్రజాస్వామ్యవాదులంతా ఆ వ్యాఖ్యలను ఖండించాలి.

సెప్టెంబర్ 17 లేదా 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. జగన్, వైకాపా నేతలు ఇకనైనా అసెంబ్లీకి రావాలి. సమస్యలు అడగాల్సిన బాధ్యత ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు వస్తారో? రారో ముందే స్పష్టత ఇవ్వాలి. వైకాపా అసెంబ్లీకి రాకుండా ప్రశ్నలు ఎందుకు వేస్తోంది? ప్రశ్నలు అడిగి సభకు రాకుండా సమయాన్ని వృథా చేస్తోంది. అసెంబ్లీకి రాకుండా ప్రశ్నోత్తరాలకు ప్రశ్నలు పంపుతామంటే కుదరదు. వస్తామంటే వైకాపాకు 2 ప్రశ్నలు కేటాయిస్తాం. రాకపోతే ఆ 2 ప్రశ్నలు ఇతర పార్టీలకు ఇచ్చేస్తాం" అని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే..

మొదటిపేజీ తరువాయి

రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం.బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండ దెబ్బ కొట్టి తిక్క తిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం" అని రఘునందన్‌రావు అన్నారు.

## బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

మొదటిపేజీ తరువాయి

నల్గొండ: మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు హత్యకు పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు ఉరిశిక్ష విధించింది. 2013లో నిందితుడు మోహమ్మీ ముకట్టుము, 12 ఏళ్ల బాలిక నల్గొండలోని ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరగగా, నేడు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తుదితీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి ఉరి శిక్షతో పాటు రూ.1.10 లక్షల జరిమానాను విధించారు.

## ఆ 65 లక్షల మంది వివరాలు బయటపెట్టాలి..

మొదటిపేజీ తరువాయి

బిహార్‌లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో 65 లక్షల మంది పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే.. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను తమముందు ఉంచాలని సూచించింది. అదేవిధంగా.. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని తెలిపింది.

బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు లో గురువారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వాదనలు వినిపిస్తూ.. "ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయి. రాజకీయ వాతావరణంలో పనిచేస్తున్న నేపథ్యంలో.. వివాదాస్పదం కాని నిర్ణయమంటూ ఏదీ లేదు. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నాం. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారు" అని పేర్కొంది. ఓటర్ల జాబితాలో మరణించిన, వలసవెళ్లిన, ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల పేర్లను ఎందుకు వెల్లడించలేరని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ పేర్లను ఎందుకు బహిర్గతం చేయకూడదని.. తద్వారా బాధితులు 30 రోజుల్లోపు పరిష్కార చర్యలు తీసుకోవచ్చు కదా అని తెలిపింది. పౌరుల హక్కులు రాజకీయ నేతలపై ఆధారపడి ఉండకూడదని భావిస్తున్నట్లు చెప్పింది. అయితే.. తొలగించిన వ్యక్తుల జాబితాను పార్టీలకు ఇచ్చినట్లు ఈసీ వెల్లడించింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని తెలిపింది.

ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19 నాటికి బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. తొలగింపునకు కారణాలు సహా ప్రచురించి.. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని తెలిపింది. వార్తాపత్రికలు, రేడియో, టీవీ మాధ్యమాల ద్వారా దీనిపై ప్రచారం కల్పించాలని చెప్పింది. తన ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఆగస్టు 22లోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది.

# మైనస్‌లోకి తెలంగాణ ద్రవ్యోల్బణం

**అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే ఈ దుస్థితి**

**ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే కారణం**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావు**



వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు– దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44శాతం ఉండగా, జాతీయ సగటు-2.10శాతంగా ఉందని గుర్తు చేశారు. జూన్‌లో రాష్ట్రంలో -0.93శాతంగా ఉంటే, దేశవ్యాప్తంగా 1.55శాతంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుదల మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతాలు కావన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయన్నారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీ-ఆర్ మండిపడ్డారు. ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని.. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని.. హోప్‌లెస్ గవర్నమెంట్, హోప్‌లెస్ గవర్నెన్స్ అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం దగ్గర ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఐటీ–, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకెళ్లిందని, ఇప్పుడు ఆ రంగాలన్నీ కుదేలయ్యాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం వెంటనే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కేటీ-ఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోకుండా ఉండడానికి తక్షణమే ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించాలని సూచించారు. లేకపోతే, తెలంగాణ ఆర్థిక భవిష్యత్తు మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం మళ్లీ పురోగతి పథంలో నడవాలంటే, ప్రభుత్వం తన వైఫల్యాలను సరిదిద్దుకోవాలని కేటీ-ఆర్ హితవు పలికారు. అలాగే మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక నిర్వహణలో వైఫల్యం చెందారని.. ఆయన ఆరోపించారు. రాష్ట్రం ప్రమాదకర ద్రవ్యోల్బణ స్థాయిలోకి ప్రవేశించిందని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వరుసగా రెండో నెల కూడా ద్రవ్యోల్బణంలోకి జారుకుందని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ రివర్స్ గేర్‌లో ఉందనడానికి ఇది ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. డిమాండ్ కుప్పకూలిపోతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్క నుండి చూస్తోందని విమర్శించారు. ఆరోగ్యకరమైన వృద్ధిని నిర్ధారించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ కూడా ద్రవ్యోల్బణాన్ని 2-6శాతం మధ్య ఉంచాలని లక్ష్యంగా పెట్టు-కుందని సూచించారు. కానీ తెలంగాణ ఇప్పుడు 0 శాతం కంటే తక్కువగా ఉందని వివరించారు. గ్రామీణ, పట్టణ ద్రవ్యోల్బణం జూన్‌లో -0.93 శాతం ఉంటే.. జూలైలో -0.44 శాతానికి కు పడిపోయిందని పేర్కొన్నారు. ఇది విజయం కాదు.. ఇది ఆర్థిక రెడ్ అలర్ట్ ఆయన స్పష్టం చేశారు.

# లయోలా అకాడమీలో హర్ ఘర్ తిరంగ వేడుకలు

## - Loyola is always Loyal to Nation •










**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
లయోలా అకాడమీ తిరంగా వేడుకలను ఘనంగా జరుపుకున్నది.
'హర్ ఘర్ తిరంగ' ప్రచారాన్ని ఆగస్టు 12, 13 మరియు 14 తేదీలలో నిర్వహించిన వరుస కార్యక్రమాలతో సగర్వంగా జరుపుకున్నది.మూడు రోజుల వేడుకలో లయోలా విద్యాసంస్థల్లోని వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.జాతీయ నినాదాల రూపకల్పన, రీల్ తయారీ, పాటల రచన, పెయింటింగ్ మరియు డ్రాయింగ్, లోగో డిజైన్, సెల్ఫీ బూత్ వంటి కార్యక్రమాలతో దేశం పట్ల విద్యార్థులు తమ ప్రేమను చాటుకున్నారు.2025 ఆగస్టు 14న విద్యార్థి మండలి సభ్యులు ప్లకార్డులు పట్టుకుని కళాశాల చుట్టూ ర్యాలీ చేస్తూ దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

### - దేశమే ముఖ్యం

విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడం ద్వారా, లయోలా అకాడమీ తన విద్యార్థులలో దేశం పట్ల జాతీయ భావ గర్వాన్ని, జాతీయ ఐక్యతతో పాటు దేశం పట్ల బాధ్యతను పెంపొందించడానికి లయోలా తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నదని యాజమాన్యం చాటుకున్నది.

# మేడ్చల్ జిల్లాలో నిన్న విద్యాసంస్థలు బంద్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, పలు జిల్లాల్లోని విద్యాసంస్థలకు గురువారం సెలవులు ప్రకటించారు. మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భారీ వర్షాలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు నిన్న గురువారం రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు.హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్‌తో సహా మరో 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# రైతులను బిజెపి ప్రభుత్వం దగా చేస్తుంది

**కరపత్రం ప్రతినిధి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 14**
సిద్దిపేట జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వరి,మొక్కజొన్న, పత్తి పంటలు 5 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరుగుతుంది. ఇట్టి పంటలకు సంబంధించి కేంద్రము లో ఉన్న బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ప్రభుత్వం జిల్లాకి ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేయవలసి ఉన్నది. కానీ ఇప్పటికీ సరిపడే యూరియా పంపక నానో యూరియా, డి ఏ పి రైతులు వాడితే ఎక్కువ పంట దిగుబడి వస్తదని, కాలుష్యం ప్రభావం తగ్గుతుందని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చెప్పడం జరుగుతుంది. కానీ వాస్తవానికి రైతులకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు పెట్టక వివిధ రాష్ట్రాలకు ఏకపక్షంగా కోత విధించడం వల్ల రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వాస్తవానికి నానో యూరియా, వల్ల అధిక దిగుబడి లాభాలు జరిగినట్టు ఇప్పటికి శాస్త్రవేత్తలు కంపెనీలు ఎక్కడ వారి పరిశోధనలో తేల లేదు. నివేదికలు కూడా ఇవ్వలేదు. అదేవిధంగా రైతులకు వాస్తవ ధర యూరియాకు 2800 ఉంటే గత ప్రభుత్వాలు, ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వం 270/- యూరియా అందించడం జరుగుతుంది. 90 శాతం సబ్సిడీ ఇవ్వడం వల్ల ప్రజల మీద భారం పడకుండా రైతులు పంటలు పండించడం జరుగుతుంది. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులకు 60%శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది. కానీ కాంగ్రెస్, బిజెపి అంతర్గత రాజకీయ కక్షలను సబ్సిడీ ఎత్తివేసటానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో కూడా 20 వేల కోట్ల కేటాయింపులు తక్కువగా చేయడం జరిగింది. గతంలో బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను కూడా తీసుకురావడం జరిగింది. రైతులకు ఇచ్చే సబ్సిడీలు తొలగించుకునేందుకే కేంద్ర ప్రభుత్వం హడావుడిగా రైతులను తప్పుదోవ పట్టించడం జరుగుతుంది. వెంటనే ఇట్టి విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ గారు రైతులకు సరిపడే యూరియా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బిఎస్పి పార్టీ పక్షాన కోరడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, రైతులు కాశ వేణి ఓదాయ్య, దొంతర వేణు రాములు, మల్లయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదుల సంక్షేమం కోసమే బార్ కౌన్సిల్




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి బార్ అసోసియేషన్ ను సందర్శించిన కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి న్యాయవాది ఐదేళ్లకు ఒకసారి బార్ కౌన్సిల్ నుండి ప్రాక్టీస్ సర్టిఫికేట్ పొందాలని సూచించారు. ఇటీవల మారిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు జూనియర్ న్యాయవాదులకు క్రిమినల్ లా బుక్ ను అందించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.

# పేద ఆర్యవైశ్యులకు అండగా నిలవాలి

### - సహకరించిన దాతలకు ధన్యవాదాలు



**కరపత్రం ప్రతినిధి డెస్క్**
పేద ఆర్యవైశ్యులకు ఆపద వస్తే అండగా నిలవాలని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన పేదింటి సరస్వతి పుత్రుడు కొణతం సాయి కార్తికేయ ప్రతిభ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.సాయి కార్తికేయ తండ్రి అనారోగ్యంతో మరణించడంతో తల్లి రోజు వారి పని చేస్తూ జీవనం కొనసాగిస్తూ సాయి కార్తికేయను చదివిస్తున్నారు.ఇటీవల కార్తికేయ అమ్మమ్మ కూడా అనారోగ్యంతో మరణించడంతో ఆర్యవైశ్యుల సహకారంతో దహన సంస్కారాలు సైతం నిర్వహించారు. వచ్చిన ఆర్థిక సహాయంతో దహన సంస్కారాలను నిర్వహించగా, మిగిలిన ఆర్థిక సహాయము రూ.20 వేల రూపాయలను సాయి కార్తికేయకు కాలేజీ ఫీజుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో సమాచారం తెలుపగా ఎంతోమంది దాతలు స్పందించి ముందుకు రావడం హర్షనీయమని అన్నారు.ఆర్యవైశ్యుల్లో ఉన్న పేదలకు ఏ ఆపద వచ్చిన అండగా నిలిచి, సహాయ సహకారాలు అందించాలని కోరారు.అండగా నిలిచిన దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పురం నాగరాజు,సాయి కార్తికేయ లు ఉన్నారు.

# మెట్ పల్లి మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం 2000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నాన్ నాబార్డు గోదాములో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన పాత గన్నీ సంచులు మంటల్లో కాలిపోయాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఉద్యోగులు, కార్మికులు మంటలను అదుపులోకి తేవడానికి సహాయ సహకారాలు అందించారు. ఈ సహాయానికి మార్కెట్ కమిటీ అధ్యక్షులు కూన గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు.

# అక్కన్నపేట మండల కేంద్రంలో సామాజిక విప్లవకారుడు, తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వారోత్సవాలు

**కరపత్రం ప్రతినిధి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 14**
అక్కన పేట మండల కేంద్రంలో తెలంగాణ గౌడ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల సహకారంతో ఆగస్టు 18 సర్వాయి పాపన్న జయంతి పురస్కరించుకొని వారోత్సవాల్లో భాగంగా పాపన్నకు ఘన నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ...ఉమ్మడి వరంగల్ జిల్లా ఖిలాసాపూర్ గ్రామంలో నిరుపేద కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించాడు. జమీందారులకు జాకీర్దారులక అరాచకాలకు వ్యతిరేకంగా వ్యతిరేకంగా పోరాడిన డెక్కన్ విప్లవకారులు సర్దార్ సర్వాయి పాపన్న. మొగల్ సామ్రాజ్యాన్ని వనికించిన వీర యోధుడు. మరాఠా సామ్రాజ్యాధినేత చత్రపతి శివాజీ సమకాలికుడు సర్వాయి పాపన్న 12 మంది సైన్యాన్ని 12వేల సైన్యంగా తయారుచేసి మొగల్ చక్రవర్తుల పైన దండయాత్ర చేస్తూ వరంగల్, భువనగిరి కోటలను జయించినాడు.. 25 సంవత్సరాల వయసులోనే సర్వాయిపేట గ్రామంలో పెద్ద కోటను నిర్మించి అక్కడి నుంచి బహుజన పాలన అందించాడు. తన పాలనలో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశాడు.. గోల్కొండ కోట పైన జెండా ఎగరవేసి నిజాం గుండెల్లో వణుకు పుట్టించిన మహావీరుడు... పాపన్న చరిత్రను



పాఠ్యాంశాల్లో చేర్చాలని ట్యాంకుబండు పైన విగ్రహాన్ని విగ్రహాన్ని నెలకొల్పాలని పాపన్న ఆశలను యువత ముందుకు తీసుకు వెళ్ళినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని తెలిపారు... ఈ కార్యక్రమంలో.... ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తెలంగాణ గౌడ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్ హుస్నాబాద్ జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్, అక్కన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగంపల్లి ఐలయ్య, సంఘం ప్రధాన కార్యదర్శి పచిమట్ల శ్రీకాంత్ గౌడ్, బుర్ర ప్రభాకర్ గౌడ్,ఉస్మానియా జెఎసి వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, మల్లంపల్లి మాజీ సర్పంచ్ మార్క తిరుపతి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంగని శ్రీనివాస్ గౌడ్, జాగిరి రవీందర్ గౌడ్, జాగిరి దేవేందర్ గౌడ్, తాళ్లపల్లి మల్లేశం, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మండల జంపన్న యాదవ్, పత్తిపాక త్రిమూర్తి, మాచర్ల ఐలేష్, మల్లంపల్లి మాజీ ఎంపిటిసి మేక రమేష్ జె పోతారం మాజీ ఎంపిటిసి బానోతు భాస్కర్ నాయక్, భూక్య మోహన్ నాయక్, గంగారపు అనిల్, తదితరులు పాల్గొన్నారు..

# మెట్ పల్లిలో ఎన్ఎస్ఎస్ శ్రమదానం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం జరిగింది. కళాశాల ఆవరణలో, జాతీయ రహదారి పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించడంతో ప్రాంగణం ఆకర్షణీయంగా మారింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వేంకయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తొంటి దేవన్న, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీధర్ బాబు కి అరుదైన గౌరవం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన

**– జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్.**



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి కి ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఐఏ జాబితాలో మంత్రి శ్రీదర్ బాబు కి అరుదైన గౌరవం దక్కడం పట్ల మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు.అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ ప్రకటించిన జాబితాలో శ్రీధర్ బాబు పేరు ఏడవ స్థానంలో ఉందని భారత్ ను ఐఏ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వారికి ఇందులో చోటు కల్పించారని తాజోద్దీన్ పేర్కొన్నారు.

## వొవెల్స్ స్కూల్ లో ఘనంగా ముందస్తు జన్మాష్టమి వేడుకలు .

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**




కరీంనగర్ జిల్లా కేంద్రంలో శ్రీ కృష్ణుని జన్మదినం సంధర్బంగా స్థానిక విద్యానగర్ లోని వొవెల్స్ స్కూల్ లో ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీ కృష్ణ , గోపికల వేషధారణలో పాఠశాలకు హాజరై కనువిందు చేసారు. ఈ వేడుకలో చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. అనంతరం ఆటలు, పాటలు , డాన్స్ లతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం , ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన ఏసీపీ విజయ్‌కుమార్ - సీఐ రామచంద్రరావు లకు టీఎన్జీవోల శుభాకాంక్షలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 14**
టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కుమార్ , వన్‌టౌన్ సీఐగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎల్. రామచంద్రరావు ని టీఎన్జీవోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా వారు నూతన బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు అధికారులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి ,నాగుల నరసింహస్వామి, సర్దార్ హర్మేందర్ సింగ్ ,సందీప్ రావు ,జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రమేష్ గౌడ్ ,కరీంనగర్ పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి ,కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు

## కోరా జాన్సన్, ఎ.ఎన్.సి.పాటశాలలో ఘనంగ ముంధస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 14**
నగరంలోని కోరా,జాన్సన్ పాటశాలల్లో ఘునంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.ముందుగా పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ,




వంగల సంతోష్ రెడ్డి కృష్ణుడి ప్రతిమకి జ్యోతిని వెలిగించి కార్యక్రమన్ని ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణ,గోపికా,రాధిక వేషధారణతో నృత్యాలు,స్లోకాలు,పాటలు పాడారు. విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణ,గోపికా,రాధిక వేషధారణతో నృత్యాలు,శ్లోకాలు,పాటలథో నాటికలతో అలరించారు.యజమాన్యం చిన్నరులతో కలిసి ఉట్టి కొట్టే సంబరాల్లో పాల్గొన్నారు.దీనిలో బాగంగా పాటశాల చైర్మన్ , డైరెక్టర్లు మాట్లాడుతు మన తెలుగు వారి సంప్రదాయ పండుగల్లో కృష్ణాష్టమి పండుగ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటామని,వివిధ రకాల మితయిలని దేవుడికి సమర్పిస్థమని నగర వీధుల్లో చిన్న పెద్ద తరథమ్యం లేకుండా ఉట్టి కొట్టే వేడుకల్లో పాల్గోని కానుకలని గెలుచుకుంటారని పెర్కొన్నారు.చిన్నారులు ఎంతో మనోహరంగా తయరయ్యారని ఈ సందర్భంగా తల్లితండ్రులకి కృష్ణాష్టమి వేడుకలో పలుపంచుకొన్న ఉపాధ్యాయ బృంధానికి విద్యార్థులకి కృష్ణాష్టమి శుభకాంక్షలు తెలియజేసారు.

# వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

**– ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులు**
**– సెలవుల్లో ఉన్న అధికారుల, సిబ్బంది వెనక్కు**
**– భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో**
**– రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్**





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపధ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ. గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి.పొంగులేటి శ్రీనివాసరెడ్డి.ఆదేశించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో మంత్రివర్యులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ వీసీ లో మెదక్ కలెక్టరెట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా ఎస్పీ డీ . వి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ.....గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు
గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు.అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.జిల్లాలో వర్షాలు వరదల వల్ల ప్రజలుకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా వివరించారు.ఈ వీసీ లో సంబంధిత శాఖల వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

# రామకృష్ణ కాలనీలో మహనీయుల విగ్రహాల శుద్ధి , తిరంగా ర్యాలీ.

**– ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రతీకగా పంద్రాగస్టు వేడుకలు.**
**– ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయండి.**
**– బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
తిరంగా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా తిమ్మాపూర్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున రామకృష్ణ కాలనీలోని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టి, ఆ మహనీయులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులుమాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయానికి ప్రతీకగా పంద్రాగస్టు వేడుకలు నిర్వహించుకొని , ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సూచన మేరకు ప్రజలతో కలిసి తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని, దేశభక్తి పూరిత కార్యక్రమాలు చేపట్టేలా ప్రోగ్రాములు నిర్వహిస్తూ , దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయాలని సూచించారు.ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ విజయం దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. యావత్ ప్రపంచమే సింధూర్ ఆపరేషన్ , భారత్ ధైర్య సాహసాలు , శక్తి సామర్థ్యాలను చూసి నివ్వరపోయిందన్నారు. సింధూర్ తో దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుందన్నారు. అందుకే ఆపరేషన్ సింధూర్ పంద్రాగస్టు వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆగస్టు 15న ఆ దిశగా కార్యక్రమాలను చేపడుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. పార్టీ కార్యకర్తలు అందరి ఇంటిపై, కార్యాలయాల భవనాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని, సాధ్యమైనంతవరకు పిల్లల చేత జెండాలు ఎగర వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి ఎల్ల జోగిరెడ్డి, బీజేవైఎం జిల్లా ఈసీ మెంబర్ బండి సాగర్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు వేల్పుల ఓదెలు, కిషన్ మోర్చా జనరల్ సెక్రెటరీ బుర్ర శ్రీనివాస్ ,చింతం లక్ష్మణ్ ,కామెర వెంకటేష్, భూత్ అధ్యక్షుడు కోతి రాజు ,పల్లె శ్రీనివాస్ రెడ్డి ,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లోగో మార్పు: నూతన లోగో ఆవిష్కరణ.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 14**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త లోగోను ప్రతిపాదిస్తూ, లోగో మార్పునకు రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన లోగో రూపకల్పనను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రతిపాదించారు.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ భద్రత, శాంతిభద్రతల సంరక్షణలో నిబద్ధతను సూచించేలా ఈ లోగోను రూపొందించారు. ఈ లోగోలో WHO DARES, WINS అనే పదం ఉంటుంది, ఇది ధైర్యం చేసేవాడు గెలుస్తాడు అని తెలుపుతుంది. లోగోలో కనిపించే అశోక చక్రం , నాలుగు సింహాల చిహ్నం దేశభక్తిని, శక్తిని, ప్రజల పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.నూతన లోగో గురించి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, “కొత్త లోగో కమిషనరేట్ పోలీసులలో ఒక కొత్త స్ఫూర్తిని, ప్రజల పట్ల మరింత జవాబుదారీతనాన్ని తీసుకువస్తుంది. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మేము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాం” అని పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ ఈ నూతన లోగో ప్రతిపాదనకు ఆమోదం తెలిపి, ఉత్తర్వులు జారీ చేయడంతో ఇది అధికారికంగా అమల్లోకి వచ్చింది.ఈ కొత్త లోగో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్లోని అన్ని యూనిఫాంలు, వాహనాలు, అధికారిక పత్రాలపై ఉపయోగించబడుతుందని పోలీస్ కమీషనర్ తెలిపారు.

## చెస్,యోగా పోటీలలో జోనల్ లెవెల్ కు ఎంపికైన కపిల్ బాల కుటీర్ విద్యార్థులు .

**– అభినందించిన కలెక్టర్ .**



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 14**
ఈ నెల 5 ,6, 7 తేదీలలోబైంసాలో జరిగిన ప్రాంత స్థాయి స్టేట్ లెవెల్ క్రీడా పోటీలలో కరీంనగర్ కు చెందిన కపిల్ బాల కుటీర్ సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ ఘనపరిచి చెస్ , యోగా జూనియర్ సీనియర్ విభాగంలో విజయం సాధించి జోనల్ లెవెల్ దక్షిణ మధ్య క్షేత్రస్థాయి పోటీలకు ఎంపికైనారు. ఎంపికైన ఎంపికైన క్రీడాకారులు చెస్ అండర్ 14 విభాగంలో బుర్ర అమృత, పాములపర్తి అని శ్రీ, యోగా అండర్ 17 బాదిరెడ్డి స్మైలీ శ్రీ, వెల్దండి బాల త్రిపుర సుందరి, అమ్ముల వనజ, అడిపల్లి రిషిత అండర్ 14 యోగ విభాగంలో జీల వేదాక్షరి, కానవేణి శివాని, హర్షిత, ప్రియదర్శిని, ఎంపికైనారు. సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కపిల్ బాలకోటి విద్యార్థులు శ్రీ సరస్వతి శిశు మందిర్ లో చదువుకుంటూ చదువుతోపాటు క్రమశిక్షణ క్రీడాపూర్తితో విజయాన్ని సాధించడం పట్ల క్రీడాకారులను గురువారం జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ,టీఎన్జీవో డిస్టిక్ ప్రెసిడెంట్ దారం శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవో సెక్రటరీ సంఘం లక్ష్మణరావు ,జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ అనుప్ కుమార్ ,సంక్షేమ చారిటబుల్ ట్రస్టీ బల్మూరి కరుణాకర్ రావు, చెప్పే అప్పిడి రాజిరెడ్డి ,పాఠశాల ప్రధాన ఆచార్యులు రాజమౌళి ,సృజన్ కుమార్, శ్రీనివాస్ ,ప్రభు చంద్ర, నితిన్, తదితరులు పాల్గొన్నారు.